క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెంచికల్‌పేట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెంచికల్‌పేట్ ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేజీబీ వీలో పరిసరాలను పరిశీలించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిలిచిన ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్‌వో శారద, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీవో సతీశ్, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

తహసీల్దార్‌గా రియాజ్ అలీ

వాంకిడి: మండల తహసీల్దార్‌గా రియాజ్‌అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు కలెక్టరేట్‌లో పర్యవేక్షణాధికారిగా విధులు నిర్వర్తించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన రోహిత్ దేశ్‌పాండే ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు.

వాంకిడి ఎంపీడీవోగా నస్రుల్లాఖాన్

వాంకిడి: మండల నూతన ఎంపీడీవోగా నస్రుల్లాఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇంతకుముందు ఆయన పెంచికల్‌పేట్ మండల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన వి.వి వరలక్ష్మి కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు బదిలీపై వెళ్లారు.

కౌటాల ఎంపీడీవోగా ప్రసాద్

కౌటాల: మండల కేంద్రలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కౌటాల ఇన్‌చార్జి ఎంపీడీవోగా కోట ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కౌటాల ఎంపీడీవోగా పని చేసిన నస్రుల్లాఖాన్ వాంకిడికి బదిలీపై వెళ్లారు. చింతలమానెపల్లి నుంచి ప్రసాద్ కౌటాలకు వచ్చారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ పాల్గొన్నారు

'యుద్ధవీరుల త్యాగాలను స్మరించుకోవాలి'

కాగజ్‌నగర్‌రూరల్: యుద్ధవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం భారతీయ జనతా యువ మోర్చా, ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అమరవీరుడు సంతోష్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్ దళాలపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ఏటా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు అశోక్, తిరుపతి, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లకు సన్మానం



సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కార్గిల్ విజయ్‌దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లను ఘనంగా సన్మానించారు. అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు ఎఎస్ఆర్‌మూర్తి, ఎల్లాగౌడ్, రమణయ్య, ఆకుల నాగేశ్వర్‌రావు, లక్ష్మినారాయణ, ప్రతాప్‌సింగ్, రాంబాబు, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన 'గూడు'



కూలిన ఇంటి వద్ద జానాబాయి

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు జానాబాయి నివాసం ఉండే ఇల్లు శుక్రవారం భారీ వర్షానికి కూలిపోయింది. బాధితురాలి కథనం ప్రకారం .. ఉదయం తాను ఇంట్లో లేని సమయంలో ఒక్కసారిగా ఇల్లు కూలి నేలమట్టమైందని, ప్రస్తుతం తను ఉండడానికి గూడు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలికి ఎస్సై మధుకర్ రూ. 3వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

చిచ్చుపల్లిలో వైద్య శిబిరం

వాంకిడి: మండలంలోని చిచ్చుపల్లి, కొలాంగూడ గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు. వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అలాగే కలుషిత నీరు తాగడం వల్ల వచ్చే టైఫాయిడ్, కలరా, డయేరియా వ్యాధుల గురించి వివరించారు. దోమల వ్యాప్తి పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

తెగిన కట్ట.. మరమ్మతులెట్లా?

- నిరుపయోగంగా ఇప్ప చెరువు
- నిల్వ ఉండని నీరు
- సాగునీరందక ఆయకట్టు రైతుల ఇక్కట్లు
- విరాళాలతో తాత్కాలికంగా మరమ్మతులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



తెగిపోయిన ఇప్ప చెరువు కట్ట

బెజ్జూర్: ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తున్న మండల రైతుల పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది. పంటలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఇప్ప చెరువు నిర్మించింది. అప్పట్లో అన్నదాతలు చెరువు ద్వారా పంటలకు సాగునీరు సైతం అందించారు. అయితే కొన్నేళ్లుగా చెరువు కట్టతెగిపోవడంతో చెరువు నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నా చెరువులో చుక్క నీరు కూడా నిల్వ ఉండడం లేదు.

ఏటా ఇవే తిప్పలు..

ఇప్ప చెరువు కట్ట మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఏటా తిప్పలు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరువులో పుష్కలంగా నీరు ఉండాల్సి ఉన్నా పరిస్థితి భిన్నంగా ఉంది. చెరువు కట్ట తెగిపోయి ఏళ్లు గడుస్తున్నా దానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో చుక్క నీరు నిల్వ ఉండడం లేదు. మండలంలోని బెజ్జూర్, ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్ ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునేందుకు నీరందక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ చెరువు కట్టతో పాటు పొర్లు మత్తడి సైతం ఎక్కడికక్కడ చెడిపోవడంతో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేకుండా పోయింది. చెరువులో నీరు లేకపోవడంతో నాట్లు వేసేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

విరాళాలు సేకరించి తాత్కాలిక మరమ్మతులు..

ఇప్ప చెరువుకు మరమ్మతులు చేపట్టి పంట సాగుకు నీరు అందించే విధంగా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండకపోవడంతో ఏడాది పాటు పంటకు నీరందించేందుకు రైతులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. విరాళాలు సేకరించి ఆ డబ్బులతో ప్రతీ సంవత్సరం బస్తాల్లో మట్టి నింపి తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో బస్తాలు కొట్టుకుపోతుండడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోంది. దీంతో ఆయకట్టు రైతులకు అవస్థలు తప్పడం లేదు.

సాగునీరు అందని పరిస్థితి



మండల కేంద్రంలో ఇప్ప చెరువు ఉన్నప్పటికీ పంటలకు సాగునీరు అందించని పరిస్థితి ఉంది. భారీగా వర్షాలు కురుస్తున్నప్పటికీ కట్ట తెగి ఉండడంతో చెరువులో నీరు నిల్వ ఉండటం లేదు. ఏటా ఇవే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– సీహెచ్ శంకర్, రైతు, సిద్దాపూర్

ఏళ్లుగా మరమ్మతులు లేవు



ఏళ్లుగా చెరువు కట్ట మరమ్మతులకు నోచుకోవడం లేదు. పుష్కలంగా వర్షాలు పడుతున్నా నీరు చెరువులో ఆగని పరిస్థితి ఉంది. పంటలకు సాగు నీరు అందాల్సి ఉండగా, తమ కళ్లెదుటే వృథా అవుతోంది. మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– సదయ్య, రైతు, సిద్దాపూర్

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్/బెజ్జూర్: ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను సిర్పూర్ నియోజకవర్గ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆరు మండలాల్లో రైతుల పంటలకు నష్టం జరిగిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంటలు కోల్పోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని కోరారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి రానున్న రోజుల్లో పంట నష్టపోయిన రైతులకు సర్వే చేయించి పంట నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, రహదారుల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడెం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, చింతలమానేపల్లి మండల మాజీ ఎంపీపీ నాన్నయ్య, కౌటాల మండల మాజీ ఎంపీపీ విశ్వనాథ్‌లు ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులతో ఎస్సై, పోలీసులు

బెజ్జూర్: పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా బెజ్జూర్ ఎస్సై బి.విక్రమ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన తలాయి, తిక్కపెల్లి, భీమారం గ్రామస్తులు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా మూడు గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్ నాయక్, తలాయి మాజీ ఎంపీటీసీ లంగారి శ్రీనివాస్, కృష్ణపెల్లి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీమంత్, వెంకటేష్, నాయకులు ఇస్తారి, హోంగార్డులు మహేష్, శంకర్, లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ సతీశ్

ఆసిఫాబాద్‌అర్బన్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ సతీశ్ అన్నారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చెడు వ్యసనాలను నిర్మూలించాలనే కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ, ఎస్సైలు, సిబ్బంది పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ముందుకు రావాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, ఎస్సై రాజేశ్వర్, ప్రవీణ్‌కుమార్, నాయకులు శ్రావణ్, పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు అందజేత



నూతన రుణాలు అందజేస్తున్న ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ సత్యవాణి

జైనూర్: రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు అందిస్తున్నట్లు ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సహకార బ్యాంకు మేనేజర్ సత్యవాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏడీసీసీ బ్యాంకులో నూతన పంట రుణాలు అందించారు. ఆమె మాట్లాడుతూ 205 మంది రైతులకు రుణమాఫీ కావడంతో నూతన పంట రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, తాజా మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావు, తాజా మాజీ సర్పంచుల సంఘం మండల కార్యదర్శి మెస్రం రాహుల్, నాయకులు మెస్రం శ్రీకాంత్, పెందూర్ ప్రకాశ్, దత్త, తదితరులు ఉన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలి



హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న దిన్‌కర్

వాంకిడి: మండలంలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దిన్‌కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ భవనంలో నాలుగు గదులు మాత్రమే సరిగ్గా ఉన్నాయని, మిగతా గదుల్లో వర్షపు నీరు ఉరుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మొత్తం 120 మంది విద్యార్థులు నాలుగు గదుల్లోనే ఉంటూ మిగతా గదులు ఎప్పుడు కూలిపోతాయోనని భయందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నుతన భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యా వసతిగృహాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించే వరకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని తెలిపారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

రెబ్బెన: సమగ్రశిక్షలోని వివిధ విభాగాల్లో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారికి ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగించడం అన్యాయని సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వేముల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 61 సంవత్సరాలు నిండి తొలగించిన సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించాలన్నారు. తొలగించిన ఉద్యోగులకు రూ.5లక్షలు అందించడంతో పాటు ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు, జిల్లా కేంద్రం నుంచి అసెంబ్లీ వరకు పాదయాత్ర చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సీఆర్పీలు దేవేందర్, రాజేశ్, మహేశ్వర్, పీటీఐ శేఖర్, మెసేంజర్ రామయ్య, గద్దం లక్ష్మి, ఆత్రం లక్ష్మక్క పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠ్యపుస్తకాలు అందించాలి

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించేలా చూడాలని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పూదరి సాయి కోరారు. శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సింగరేణి కార్మికుల పిల్లలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు, రైతుకూలీలు, ప్రైవేటు డ్రైవర్ల పిల్లలు చదువుకుంటున్నారన్నారు. వారికి ఉచితంగా పుస్తకాలు అందేలా చూడాలన్నా రు.

అండర్‌పాస్ బ్రిడ్జి సందర్శన

రెబ్బెన: మండలంలోని జిల్లా సరిహద్దు వద్ద మంచిర్యాల టూ చంద్రపూర్ జాతీయ రహదారిపై వన్య ప్రాణుల కోసం నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జిని శుక్రవారం ట్రైనీ బీట్ అధికారులు సందర్శించారు. దూలపల్లి ఫారెస్టు అకాడమీకి చెందిన ట్రైనీ బీట్ అధికారులు శిక్షణలో భాగంగా తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలో గల అండర్‌పాస్ బ్రిడ్జిని పరిశీలించారు. బీట్ అధికారుల శిక్షాధికారి ఏసీడీ రామ్మోహన్, రెబ్బెన ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో శ్రీధరాచారి, సెక్షన్ అధికారి సతీశ్‌లు ట్రైనీ బీట్ అధికారులకు అండర్ పాస్ బ్రిడ్జి ప్రాముఖ్యత వివరించారు.

చోరీకి యత్నం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన ఓ కుటుంబం శుక్రవారం రాత్రి కలిసి భోజనం చేస్తుండగా, ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి దొంగతనానికి యత్నించగా, కుటుంబసభ్యులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈశ్వరమ్మ -విశ్వనాథంలు భోజనం చేస్తుండగా, ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. అరిస్తే చంపేస్తానంటూ కూతురు జ్యోతి నోరుమూసి భయభ్రాంతులకు గురిచేశాడు. వెంటనే స్పందించిన జ్యోతి పక్కనే ఉన్న డబ్బాలో నుంచి కారంపొడిని దుండగుడి ముఖంపై చల్లింది. అనంతరం కాగజ్‌నగర్ పట్టణ సీఐ శంకరయ్యకు ఫోన్‌లో సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గుర్తుతెలియని వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని భట్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సౌండ్‌బాక్స్‌లు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా స్నూకర్ బెట్టింగులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణ శివారులోని బోరిగాం కాలనీలో స్నూకర్ బెట్టింగులు నిర్వహిస్తున్న వ్యవహారం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఇదే కాలనీకి చెందిన ఓ మహిళ స్నూకర్‌కు సంబంధించిన వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. కాగజ్‌నగర్ -ఆసిఫాబాద్ ప్రధాన రహదారిని ఆనుకొని బెట్టింగ్‌లు కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని సదరు మహిళ ఆరోపించారు. ఒక్కో గేమ్‌కు రూ. 500 నుంచి రూ. 5వేల వరకు బెట్టింగ్‌లు పెడుతున్నారని, గంజాయి సేవిస్తూ భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారని, ఉదయం నుంచి రాత్రివరకు ఈ అడ్డాలోనే బెట్టింగులకు పాల్పడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని, చేతిలో డబ్బులు లేని యువతకు నిర్వాహకులే వడ్డీకి డబ్బులు అప్పుగా ఇస్తున్నారని సదరు మహిళ తీవ్రస్థాయిలో ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ కావడంతో ఘటన స్థలానికి కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు చేరుకుని నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకులు ఇర్షాద్‌అలీ, రహెమాన్ అలీలను తహసీల్దార్ కిరణ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సోనియా తెలిపారు.

సన్మానం

బెజ్జూర్: మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్యను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంను తనిఖీ చేసేందుకు మొదటిసారి మండల కేంద్రానికి రాగా ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు. కమిటీ డైరెక్టర్ రాజారాం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూస శంకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు భుజాడి బాబాజీ, యువజన అధ్యక్షుడు అబ్దుల్ హకీం, నాయకులు జావిద్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ సిబ్బంది పవన్ ఉన్నారు.

ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌తో కలిసి నిరసన తెలిపారు. కోవ విజయ్ మాట్లాడుతూ ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో బాధకరమన్నారు. అంబేద్కర్ అభయహస్తం, గిరిజన బంధు ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.12లక్షల ఆర్థికసాయం ఏమైందని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, నాయకులు సుభాష్, మారుతి, తుకారాం, పెంటు, శంకర్, హనుమంతు, రమేశ్, భీంరావు, విరాట్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బైఠాయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సంజీవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న నాన్ మాస్టర్ రోల్ కార్మికులకు గత నాలుగు నెలలుగా, పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీఎఫ్ కూడా రూ.రెండు కోట్లు బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం ఇద్దరు కార్మికులు మృతి చెందితే ఇప్పటివరకు నయాపైసా కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గౌరవ అధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు కృష్ణమాచారి, రమేశ్, మల్లేశ్, మధు, శేఖర్, భూమయ్య, సుధాకర్, తిరుపతి, శంకరమ్మ, శ్యామల, పద్మ, రమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒర్రె దాటి.. బడికి చేరి



పెంచికల్‌పేట్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లెడ గ్రామసమీపంలోని ఒర్రెలో నీటి ప్రవాహం పెరగడంతో కొత్తజిల్లెడకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయుడు ఉపేందర్ సహాయంతో ఒర్రె దాటి పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉండగా వర్షాకాలంలో ఒర్రెతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఒర్రెపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

కెరమెరి: జాతీయ విద్యా దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని అనేక పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు. ఎంఎన్‌వో ప్రకాశ్, హెచ్‌ఎంలు ఉన్నారు.

విద్యార్థుల హాజరు వందశాతం ఉండాలి

కెరమెరి: విద్యార్థుల హాజరు వందశాతం ఉండాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంనగర్, కల్లెగాం, భీమన్ గొంది, ధనోరా ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా హాజరయ్యారు. విద్యార్థుల హాజరు పెంచాలని, వారంలో మూడు సార్లు గుడ్లు తప్పనిసరిగా వడ్డించాలని సూచించారు.